# శిక్షణ = x1, x45, x65

కథ పేరు చూసి విస్తుపోవద్దు. ఆసాంతమూ చదివితే మీకే అర్థం అవుతుంది. డిగ్రీలు సక్రమంగా సంపాదించినవైతే కొన్ని పరిమితులలో జ్ఞానానికి పునాదులు వేస్తాయి. అయితే పరిశ్రమల్లో పురోగమించిన సాంకేతిక విజ్ఞానానికీ, ప్రాథమికంగా చదువు ద్వారా సాధించిన శాస్త్ర విజ్ఞానానికీ సర్వసాధారణంగా అంతగా పొంతన ఉండదు. దీనికి బలమైన కారణం - విశ్వవిద్యాలయాలకీ, పరిశ్రమలకీ మధ్య సరైన అవగాహన



లేకపోవడం. ఈనాటి సిలబస్ ఏళ్ళ దాకా మారదు కాని, నిన్నటి సాంకేతిక పరిజ్ఞానం ఈ రోజుకి పాతదైపోతోంది! శీఘ్రగతిలో మారిపోతున్న ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉద్యోగులు అవగాహన చేసుకోవడం కోసం, నిత్య శిక్షణా కార్యక్రమాల అవసరం ఎంతైనా ఉంది. యిది అన్ని రంగాలకూ వర్తిస్తుంది.

నాణ్యత గల ఉత్పత్తుల లక్ష్యసాధన కోసం - కొత్తగా చేరిన ఉద్యోగులకి ప్రారంభ శిక్షణా, పాత ఉద్యోగులకి పునశ్చరణ లేదా ఆధునిక శిక్షణ యిచ్చి, వారి స్థాయిని ఎప్పటికప్పుడు పెంపొందించే ప్రయత్నంగా ప్రతీ పెద్ద పరిశ్రమ యొక్క మానవ వనరుల శాఖా, శిక్షణా కార్యక్రమాలను చేబడుతుంది. పరిశ్రమ లేదా సంస్థల కేంద్ర స్థానాల్లో మొదటి, రెండవ తరగతి ఆఫీసర్ల నిమిత్తమై పెద్ద ఎత్తునా, దేశవ్యాప్తమైనప్పుడు ప్రాంతీయ

కేంద్రాలలో మూడు, నాలుగు తరగతులకు చెందిన స్థానిక ఉద్యోగుల కోసం కాస్త చిన్న ఎత్తునా శిక్షణాలయాలు నెలకొల్పబడ్డాయి. పాలనా యంత్రాంగంలో శిక్షణ అనేది ఒక ముఖ్యమైన అంశం. ఈ ధ్యేయం మంచిదే కాని –

"సర్! జనరల్ మేనేజర్ రఘువీర్ సూద్ రాజకీయ నేతల ద్వారా చాలా ఒత్తిడి తీసుకువస్తున్నాడు. సూద్ మాటిమాటికీ సెలవు పెట్టి కాని, టూర్ల మీద కాని ఢిల్లీ పరుగెత్తుకుపోతున్నాడనీ, అందుచేత అక్కడ ప్రాజెక్ట్ వ్యవహారాలు దెబ్బతింటున్నాయని ఈశాన్య ప్రాంతపు 'రీజియనల్ డైరెక్టరు' మిశ్రా నాలుగైదుసార్లు ఫోన్ చేశాడు," అన్నాడు మానవ వనరుల శాఖ మెంబరు.

"పుట్టి పెరిగిన ఊళ్ళలో కంపెనీ కేంద్రాలూ, శాఖలూ ఉంటే యిదే చికాకు! ఏం చేద్దామంటారు?" – ఛైర్మన్ ప్రశ్నించాడు.

"అతన్నిక్కడ ఢిల్లీలో మన కేంద్ర శిక్షణా విభాగానికి బదిలీ చేస్తే బావుంటుంది" అన్నాడు మెంబరు కాస్త నసుగుతూ.

"ప్రస్తుతం యిక్కడ శిక్షణా కేంద్రంలో స్వతంత్రంగా పని చేస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ రాజు గొడవ పెడ్తాడేమో?" – ఛైర్మన్ సందేహం వెలిబుచ్చాడు.

"అతను తన మెయిన్ స్ట్రీమ్ లేబొరేటరీస్‌కి వెళ్ళిపోవాలని ఎంత కాలంగానో అంటున్నాడు."

"సూద్ మెకానికల్ డివిజన్ కదా? ఎందుకైనా మంచిది – మీరీ విషయంలో కాస్త మెంబర్ టెక్నికల్‌తో మాట్లాడి కాయితం పెట్టండి. ఆయన అంగీకారం లేకుండా ఈ బదిలీ చేస్తే బావుండదు!" అన్నాడు ఛైర్మన్ మరో ఫైల్లోకి తల దూరుస్తూ.

సరిగ్గా వారం రోజుల తర్వాత మానవ వనరుల శాఖ మెంబరు సూద్‌కి టెలిఫోన్ చేసి అభినందనలు తెలియజేశాడు.

"కంగ్రాచ్యులేషన్స్! నీ పని జరిగిపోయింది. ఢిల్లీకి రాగానే మందు పార్టీ యివ్వాలి!"

"మా టెక్నికల్ మెంబరూ, ఛైర్మనూ సులువుగా ఒప్పుకొన్నారా?" – సూద్ ప్రశ్నించాడు.

"యిద్దరికీ చాలా నచ్చచెప్పవలసి వచ్చింది. ఏమైతేనే పని జరిపించేశాగా!" అన్నాడు మెంబరు ఫోన్ పెట్టేస్తూ. సూద్‌ని గురించి కొన్ని నిజాల్ని చెప్పి, కార్యాన్ని కాస్త సానుకూలం చేసిన సంగతి మట్టుకు చెప్పలేదు!

❁ ❁ ❁

ఈశాన్య ప్రాంతం ప్రాజెక్ట్‌లో సైన్సు విభాగం అధినేత జి.ఎమ్. విజయ గుప్తా సెల్‌లో పన్జేస్తున్న అరుణ్ గోవిల్ ట్రైనింగ్ ఫైలు పట్టుకొని గదిలో ప్రవేశించాడు.

గుప్తా గోవిల్‌ని చూస్తూనే, "ఆ నీలం రంగు ఫోల్డర్‌తో అడుగు పెడ్తున్నావంటే ఒళ్ళు కంపరమెత్తుతుంది. సరే, తప్పదు కదా? వచ్చి కూర్చో," అన్నాడు. అంటూ నే బల్ల

కింద నున్న స్విచ్ నొక్కి బయటనున్న ఎర్రటి బల్బుని వెలిగించాడు.

"సర్! కోర్స్ నెంబరు ఎఫ్.-01 అంటే 'ఫైనాన్స్ ఫర్ నాన్ ఫైనాన్స్ ఆఫీసర్స్' (విత్త శాఖలో పనిచేయని వారికి విత్త సంబంధమైన పరిజ్ఞానాన్ని కలిగించే శిక్షణా కార్యక్రమం)18వ తారీఖు నుంచి, అంటే యింకో మూడు రోజుల్లో ప్రారంభమౌతుంది. మనం ఆ కోర్సుకి సీనియర్ కెమిస్ట్ జగదీష్ బాత్రా పేరు పంపాం. కాని యిప్పుడు.."

"అతగాడు వెళ్ళే పరిస్థితిలో లేడంటావ్, అంతేకదా?" అన్నాడు గుప్తా.

అవునన్నట్లుగా తలూపాడు గోవిల్.

"అసలీ ట్రైనింగ్‌కి డి.జి.ఎమ్. రాఘవన్‌ని పంపుదామనుకొన్నాను. ఆయనకి ఫైనాన్స్ వాళ్ళ నుంచి ఫైల్ తిరిగి వస్తే బ్లడ్ ప్రెషర్ పెరిగిపోతుంది! వాళ్ళ దృక్పథం ఏమిటో తెలిసి వస్తే ఈయనగారికి ఉపయోగకరంగా ఉంటుందనుకొన్నాను. అయితే ఈ ట్రైనింగ్‌కి తనని పంపమని బాత్రా పదిసార్లు మొత్తుకోవడం వల్లా, నువ్వూ మరీ మరీ చెప్పడం వల్లా ఒప్పుకొన్నాను. అసలింతకీ బాత్రా వెళ్ళలేని పరిస్థితి ఏమొచ్చిందని?"

"సర్, అతని శ్రీమతికీ, చిన్నాడికీ ఒకేసారి అతిసార వ్యాధి సంక్రమించింది. వంటరిగా వదిలి వెళ్ళడానికి సందేహిస్తున్నాడు. ఆ కారణంగా మరెవర్నైనా పంపించమని అర్థిస్తున్నాడు. వచ్చి మీతో స్వయంగా మాట్లాడడానికి భయపడ్తున్నాడు!" అన్నాడు గోవిల్ సన్నాయి నొక్కులు నొక్కుతూ.

"నేషనల్ యిన్‌స్టిట్యూట్ ఫర్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తున్న ఈ కోర్సుకి తల ఒక్కింటికి అయిదు వేలు ఫీజు చెల్లించడమైంది. అందుకని నామినేట్ చెయ్యబడ్డ అభ్యర్థులు తప్పకుండా శిక్షణ పొందాలి అని మొదటే మొత్తుకొన్నట్లు నాకు జ్ఞాపకం. యిప్పుడు బాత్రా జాగాలో మరొకర్ని పంపాలి. లేకపోతే ఢిల్లీ ఆఫీసు విరుచుకు పడుతుంది! సరే, ఫిజిసిస్ట్ శేఖర్ కపూర్ని పంపిద్దాం" అన్నాడు గుప్తా.

"సర్, కపూర్‌కి టూర్ మీద నైతే విమాన ప్రయాణ అర్హత ఉంది కాని, శిక్షణా కార్యక్రమాలకి కాదు. అతను ట్రైన్లో ఢిల్లీ వెళ్ళాలంటే రేపే బయలుదేరాలి. రిజర్వేషన్ దొరకదు. విమాన ప్రయాణానికి రీజియనల్ డైరెక్టరు అనుమతి తీసుకోవాలి" అన్నాడు గోవిల్.

"ఆ పని చేస్తే అది ఆనవాయితీగా మారి అనేకమైన సమస్యలొచ్చేస్తాయ్! పోనీ మొదట్లో నేననుకొన్నట్టుగా డి.జి.ఎమ్. రాఘవన్‌ని పంపిద్దాం".

"సర్! ఆయన ఎల్లుండి బయలుదేరి చెన్నై వెడ్తున్నాడు" - గోవిల్ నెమ్మదిగా అన్నాడు.

"ఈ విషయం నాకు తెలియదే!" గుప్తా ఆశ్చర్యపోతూ అన్నాడు.

"నీటిని పెట్రోలుగా మార్చేందుకు పురోగమించిన సాంకేతిక పద్ధతులపై అక్కడి ఓ సీనియర్ కెమిస్ట్ 'రామర్ పిళ్ళై' నిర్వహిస్తున్న కోర్సు టి-02 చెన్నై ఆఫీసులో జరుగుతోంది.

దానికోసమై ఆయన వెడ్తున్నాడు!"

"అయినా డి.జి.ఎమ్. హోదాలో ఉన్న వ్యక్తి తనకన్నా నాలుగు మెట్లు దిగువగా ఉన్న వ్యక్తి నిర్వహిస్తున్న క్లాసులో కూర్చోవడం... నా కర్థం కావట్లేదు!"

గోవిల్‌కి ఎప్పుడు నోరు మూసుకోవాలో తెలుసు. అందుకని మౌనంగా ఉండిపోయాడు. రాఘవన్‌కి ఆ సమయంలో చెన్నైలో ఏవో స్వంత వ్యవహారాలు చూసుకోవాలి!

"పోనీ నితిన్ చోప్రా వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాడేమో కనుక్కో. అతనికి విమాన ప్రయాణపు అర్హత ఉందనుకొంటాను" అన్నాడు గుప్తా.

"ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ నితిన్ చోప్రాకి, ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ సతీష్ అగర్వాల్‌కి విమాన ప్రయాణ అర్హత ఉంది. యిద్దరూ సిద్దంగా ఉన్నారు" అన్నాడు గోవిల్.

"క్రితంసారి సతీష్‌ని బెంగుళూరు పంపించి తలకి రోకలి చుట్టుకొన్నాను. చెప్పేవాళ్ళకి తెలిసింది చెప్పనివ్వకుండా ప్రశ్నల రూపంలో మాటి మాటికీ అడ్డుకొని, తనకి తెలిసింది చెప్పి రసాభాస చేశాడని ఫిర్యాదు వచ్చింది. సరే, నితిన్‌ని పంపిద్దాం. అభ్యర్థి మార్పుకి కూడా ఆర్.డి. అనుమతి తీసుకోవాలి కదా?" అంటూ, గుప్తా యింటర్ కాం ఫోను తీశాడు. ఆర్.డి.కి విషయం క్లుప్తంగా చెప్పి, "మీరు ఒప్పుకొంటే ఫార్మల్‌గా నోట్ పంపిస్తాను" అని ముగించాడు.

"సర్లెండి, బాత్రా జాగాలో మరొహర్ని పంపిద్దాం. కాని నితిన్‌ని మట్టుకు కాదు. మన ఫైనాన్స్ డి.జి.ఎమ్. యశ్వంత్ సింగ్‌ని పంపిద్దాం!" అన్నాడు ఆర్.డి.

"సర్, ఈ కోర్సు..."

"నాన్‌ఫైనాన్స్ వాళ్లకని తెలుసు. అయితే వాళ్ళ సాధక బాధకాలూ, మనోభావాలూ ఫైనాన్స్ వాళ్లకి తెలియాలంటే ఈ కోర్సులో కొందరు సీనియర్ ఫైనాన్స్ ఆఫీసర్లు కూడా ఉండాలి. యిక్కడ ఫైళ్ళలో చెయ్యలేని కొన్ని యుద్ధాలని వాళ్ళు శిక్షణా సమయంలో యథేచ్ఛగా వాగ్యుద్ధాలగా మార్చుకోవడానికి ఆస్కారముంటుంది. ఒకరి కష్టాలు మరొకరికి తెలిసి వస్తాయి!"

"ఢిల్లీ ఆఫీసు అభ్యంతరం...?"

"ఆ విషయాలో మీరు నిశ్చింతగా ఉండండి. వాళ్ళేమైనా అంటే మానవ వనరుల శాఖ మెంబర్నీ, శిక్షణాలయ అధికారి రఘువీర్ సూద్‌నీ దుమ్ము దులిపేస్తాను! యింతకీ కోర్సు నెంబరెంతన్నారూ...?"

గుప్తా గోవిల్‌తో ఆర్.డి. నిర్ణయాన్ని చెప్పి,"పిట్ట తగువూ, పిట్ట తగువూ పిల్లి తీర్చినట్లుగా నీ సమస్యా, బాత్రా సమస్యా తీర్చిపారేశాడు. బాత్రా మూలంగా మనవాళ్లిద్దరి ఛాన్సు పోయింది. అతణ్ణి నా తరఫున నాలుగు చివాట్లు పెట్టి టికెట్ కాన్సిల్ చేయించుకోమను" అన్నాడు గుప్తా.

గోవిల్ తన గది చేరేసరికి నితిన్, సతీష్, బాత్రాలు ఎదురు చూస్తున్నారు. గోవిల్ ఆర్.డి. నిర్ణయం చెప్పేసరికి నితిన్, సతీష్‌లు నిరుత్సాహంగా కదిలి వెళ్ళిపోయారు. నితిన్‌కి ఢిల్లీలో అక్కా, బావల యింటికి వెళ్ళాలని కుతూహలం. వాళ్ళ యింటాయన కూతురితో నితిన్ ప్రేమాయణం ఆరంభదశలో ఉంది. సతీష్ అగర్వాల్ భార్య ఢిల్లీలో పన్జేస్తోంది.

వాళ్ళిద్దరూ గది వదిలి వెళ్ళిన తర్వాత బాత్రా అన్నాడు.

"రేపు అక్టోబర్‌లో వచ్చే టి-05 కోర్సులో నా పేరు పెట్టు."

"గుప్తా సాబ్ నీ మీద మండిపడ్డారు. నీ చెల్లెలి పెళ్ళి ఈ నెల యిరవై రెండో తారీఖున ఢిల్లీలో జరుగుతుందనీ, ఆ సమయానికి అక్కడ ఉండేటట్లు చూడమనీ నువ్వు రెండు నెలల క్రితం గోలపెడ్తే, చచ్చి చెడి గుప్తా సాబ్‌కి నచ్చచెప్పి నీ పేరు 'ఎప్రూవ్' చేయించాను. నిన్న వచ్చి, హఠాత్తుగా పెళ్ళి పోస్ట్‌పోనై పోయిందనీ, యిప్పుడీ కోర్సుకి వెళ్ళి ప్రయోజనం లేదనీ గోల పెట్టావు. నీ శ్రీమతికీ, చిన్నాడికీ ఒకేసారి సుస్తీ చెయ్యడం వల్ల నువ్వు వెళ్ళే పరిస్థితిలో లేవని అబద్ధం చెప్పి ఎలాగో కార్యం సాధించాను. ఆయన నీకు తటస్థపడి భార్యా, బిడ్డల ఆరోగ్యం గురించి ప్రస్తావిస్తే జాగ్రత్తగా సమాధానాలు చెప్పు!"

"ముందుగా వార్నింగ్ యిచ్చినందుకు థాంక్స్! కాని అరుణ్, అక్టోబరు కోర్సుకి ఎలాగైనా...?"

"బాస్ డొక్క చీరేస్తాడు. కాని నువ్వు స్నేహితుడివి కాబట్టి ఓ ఉపాయం చెబుతున్నాను. ప్రోజెక్ట్ కార్యక్రమాల అవగాహన గురించి నాన్ టెక్నికల్ ఉద్యోగులకి లెక్చర్లివ్వడానికి ఎవర్నైనా పంపమని నిన్ననే మెసేజ్ అందింది. గుప్తా సాబ్ రేపు ఆర్.డి.తో కలిసి ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్‌కని ఢిల్లీ వెళ్తున్నారు. నీ పేరు థాకరే సాబ్‌తో క్లియర్ చేయిస్తాను సరేనా?"

"లెక్చర్లు వినడం కోసం వెడ్తే సందు చూసుకొని దుమ్మా కొట్టొచ్చు. కాని లెక్చర్లివ్వాలంటే అన్ని రోజులూ చచ్చినట్టు ఉండాలి. సరేలే, ఏదో ఒకటి!"

"అదీ నేను రిస్క్ తీసుకొని చెయ్యాలి, తెలుసా?" అన్నాడు గోవిల్.

"సాయంకాలం క్లబ్‌కి వస్తావు కదా, బీరు కొట్టిస్తాను!" అన్నాడు బాత్రా.

"సాబ్ బ్రిడ్జి ఆడడం కోసం ప్రతి రోజూ క్లబ్ కొస్తాడు. ఆయన కంటబడ్తే బండారం బయట పడుతుంది. ఆ యిచ్చేదేదో నీ యింట్లోనే అఘోరించు. ఈ విషయంలో నీ శ్రీమతిని కూడా హెచ్చరించు, ఎందుకైనా మంచిది!"

"బీరుకేం నిక్షేపంలా తాగిస్తాను. కాని యివ్వాళ సాయంత్రం క్లబ్‌లో ఓ లేడీస్ ఫంక్షన్ ఉంది. దానికోసం శ్రీమతి ఉదయం నుంచీ తెగ తాపత్రయపడిపోతోంది. ఆ ఉత్సాహం

మీద నీళ్ళు చల్లి ఆవిణ్ణి యింట్లో ఎలా కూర్చోపెట్టాలీ అన్నది సమస్య!" అని సణుక్కుంటూ బాత్రా బయటకు దారితీశాడు.

❁ ❁ ❁

ఆ రోజు జి.ఎమ్. టెక్నికల్ శ్యామలరావు చాలా చికాకుగా అన్నాడు – "సంస్థ శాంక్షన్లూ, ప్రభుత్వం అనుమతులూ, టెండర్లూ, రాజకీయపరమైన ఒత్తిళ్ళూ – రకరకాల తలనొప్పులు భరించి, నానా అగచాట్లూ పడి మన ప్రాంతానికి ఈ కొత్త ప్లాంట్‌ని సాధించాను. యిక ముందు, అడుగు వెయ్యడం నాకు సాధ్యం కాదు!"

"ఏంవొచ్చిందని?" రీజియనల్ డైరెక్టర్ మిశ్రా చిద్విలాసంగా అడిగాడు.

"అమెరికాలో ప్లాంట్ పరికరాలు షిప్‌మెంట్‌కి సిద్ధంగా ఉన్నాయి. మన ఆఫీసర్లను తరిఫీదు చేసే విషయమై పంపిన ఫైలు అష్టవంకర్లతో అధ్వాన్నంగా తయారైంది. అమెరికా నుంచి ఆ కంపెనీ వాళ్ళప్పుడే నాలుగుసార్లు మాట్లాడారు మన వాళ్ళెప్పుడొస్తున్నారని."

"ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన ఫైలు మీకు నిన్ననే పంపించానుకదా? దాని ప్రకారం ఆదేశాల్ని పాటించడం మంచిది" అన్నాడు మిశ్రా.

"నేను పదిహేను మందిని విదేశీ శిక్షణ కోసం ప్రతిపాదిస్తే, మీరు దాన్ని పదిమందికి కుదించి డిల్లీ పంపారు. ఛైర్మన్ ఎనమండుగురికే ఒప్పుకొని, పంపదలచుకొన్న ఎనమండుగురి పేర్లతో లిస్ట్ ఫైనలైజ్ చేసి, జస్టిఫికేషన్‌తో సహా తిరిగి పంపమన్నాడు. ఆయన ముందుచూపు కలవాడు. కొన్ని పేర్లని తొలగించే బాధ్యత మన మీదకే నెట్టివేసి, మన భుజాల మీదుగా తుపాకి పేలుస్తున్నాడు. యిప్పుడేం చేసేది?" అన్నాడు శ్యామలరావు వేదనగా.

"సీనియారిటీ! సీనియారిటీ! జూనియర్స్ పేర్లు తీసిపారెయ్యండి!" అన్నాడు మిశ్రా అదే మంచి పద్ధతి అన్నట్లుగా.

"వచ్చిన దౌర్భాగ్యమేమిటంటే అతి సమర్థవంతులైన ఆరుగురు ఆఫీసర్లు సీనియారిటీలో దిగువన ఉన్నారు! ఈ కొత్త ప్లాంట్ విజయం వారి మీద ఆధారపడి ఉంది."

"అయితే కొంతమంది సీనియర్స్‌ని తియ్యక తప్పదు. కావేరి ప్లాంట్ తరిఫీదు కోసం యిదివరలో సతీష్ షా రష్యా వెళ్ళాడు కదా. అతని పేరు తీసెయ్యవచ్చు."

"అతని పేరు నేను ప్రతిపాదించనేలేదు. అనుభవమున్న సీనియర్ ఆఫీసరు టీంలో ఉండాలని మెంబరు టెక్నికల్ అతని పేరు ప్రతిపాదించి అందరిపైనా పెట్టాడు."

"నిర్మల్ చౌరాసియా – యితను యిదివరలో వారం రోజులు ఫ్రాన్స్‌కి ఏదో కాన్ఫరెన్స్‌కి వెళ్ళినట్టు జ్ఞాపకం" అన్నాడు మిశ్రా.

"అతని పేరూ నేను ప్రతిపాదించలేదు. కాని అతను 'అది వారం రోజుల కాన్ఫరెన్స్. యిది మూణ్ణెల శిక్షణా కార్యక్రమం. దేని దారి దానిదే' అనీ, ఆరక్షణ నియమాల ప్రకారం

ముప్పై శాతం తమ వర్గం వారిని పంపి తీరాలని, కావాలనే తనని వారం రోజులు ఫ్రాన్స్‌కి సమావేశాలకి పంపి ఈ అమెరికా అవకాశం దక్కకుండా చేశారని నిందారోపణ చేశాడు. అందుచేత మెంబర్ (మానవ వనరుల శాఖ) అతని పేరు విధిగా ఉండాలని శాసించాడు. వాస్తవానికి చౌరాసియా ఫ్రాన్స్ వెళ్ళింది గుజరాత్ స్థావరం నుండి. ఆ తర్వాతే అతను యిక్కడకు బదిలీ మీద వచ్చాడు."

"ఎనిమండుగురిలో ముప్పై శాతం అంటే 2.4. యిది జీవుల విషయంలో అసాధ్యం కనుక, రెండుకి కుదించినా ఆ కేటాయింపులో మరొకర్ని పంపాలి. మనం పంపిన లిస్టులో ఎవరైనా ఉన్నారా?"

"మూడో అతను కృష్ణన్. ఆఖర్న ఉన్న దావే ఆ రక్షణ కేటగిరికి చెందిన వారే. చౌరాసియా కృష్ణన్ కన్నా చాలా సీనియర్. దావే సమర్థవంతుడు. యువకుడు. అందుకని దావే పేరుంచి కృష్ణన్ పేరు..."

"ఆ పని మాత్రం చెయ్యొద్దు. మన సంస్థకి సంబంధించిన మంత్రి తమిళనాడు వాడని మరచిపోవద్దు! సరే ఈ యిద్దర్నీ కూడా లిస్ట్‌లో ఉంచితే యిప్పటికి నలుగురు తేలారు. మిగిలిన నలుగుర్నీ నిర్ధారణ చెయ్యాలి" అన్నాడు మిశ్రా.

"మనం పంపని పేరు యింకొకటి లిస్ట్‌లో ఉంది. దల్జిత్ సింగ్."

"అతని పేరెవరు వ్రాశారు?" – ఆర్.డి. మిశ్రా ప్రశ్నించాడు.

"ఛైర్మన్ ఆ దేశం మీద మానవ వనరుల శాఖ మెంబరు ఆ పని చేశాడని ఓ గాలి వార్త. దల్జిత్ సింగ్ మన సంబంధిత మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యదర్శి అల్లుడి తమ్ముడు!'

"అతను వీరందరి కంటే సీనియర్ కదా, సమస్య ఉండదు."

"అతను ఈ ప్రోజెక్ట్‌లో మూడు సంవత్సరాలున్నాడు. మన కంపెనీ నియమాల ప్రకారం స్వచ్ఛందంగా కోరితే తప్ప ఈ ప్రాంతంలో మూడు సంవత్సరాల కన్నా ఎక్కువ ఉండనక్కర్లేదు. అతనికి బదిలీ రావలసిన సమయం. శిక్షణ పూర్తయ్యే వరకూ నోరు మూసుకొని కూర్చుని, ఆ తర్వాత బదిలీ కోసం అర్జీ పెట్టుకొని వెళ్ళిపోతాడు. అదీకాక ఈ ప్లాంట్ మన ప్రాజెక్ట్‌లో తప్ప వేరే చోట లేదు" – శ్యామలరావు మరో కొత్త కోణం మిశ్రా దృష్టికి తీసుకువచ్చాడు.

"బదిలీ ఆపుచేయిద్దాం. లేదా ముందుగానే దల్జిత్ సింగ్ నుండి లిఖిత పూర్వకమైన హామీ తీసుకొందాం."

"సర్, బాధ్యతల నుండి తప్పించుకోవడంలో యితడు గ్రాండ్ మాస్టర్! మన మాటలు పొల్లుబోవడమేకాని ఇతను మనకు చిక్కడు!"

"నువ్వన్నమాట నిజమే. కాని ఒక సంగతి ఆలోచించు. మన ఛైర్మన్‌కి సంస్థ అభివృద్ధి కోసం సంబంధిత మంత్రిత్వ శాఖతో సత్సంబంధాలు ఉంచుకోక తప్పదు. ఆయన

పరిస్థితి కూడా మనం ఆలోచించాలిగా" అన్నాడు మిశ్రా వేదాంత ధోరణిలో.

"మరి మిగిలిన ముగ్గురూ?" శ్యామలరావు ప్రశ్నించాడు.

"ఈ రాష్ట్రానికి చెందిన వారెవరైనా ఉన్నారా? ప్రాంతీయ రాజకీయాలని కూడా దృష్టిలో ఉంచుకోవాలి."

"యిద్దరు పైనా, ఒక్కరు నేను చెప్పిన దిగువ ఆరుగురు సమర్థవంతులలోనూ ఉన్నారు."

"అయితే ఈ ఎనమండుగురి పేర్లూ నిర్ధారించి ప్రతిపాదనని పెట్టండి. నేను స్వయంగా ఫైల్ తీసుకొని ఢిల్లీ వెళ్ళి ఛైర్మన్ అనుమతి తీసుకొంటాను."

"సర్, చాలా రిప్రెజెంటేషన్స్ వస్తాయి. మరో నలుగురు అభ్యర్థుల్ని ఛైర్మన్ ఒప్పుకొనేటట్టు ప్రయత్నం చెయ్యండి" అన్నాడు శ్యామలరావు అభ్యర్థనగా.

"విదేశీ ద్రవ్యపు ఖర్చుని అదుపులో ఉంచవలసిందిగా రోజుకో ఉత్తర్వు వస్తోంది. ఛైర్మన్ ఒప్పుకోడు. రాబోయే రిప్రెజెంటేషన్స్ గురించి యిప్పట్నుంచీ తలబాదు కోవలసిన అవసరం లేదు. ఆ సమయం వచ్చినప్పుడు చూద్దాం" అన్నాడు ఆర్.డి. మిశ్రా విషయాన్ని ముగించేస్తూ.

ఆమోదించబడిన ఆఫీసర్లు శిక్షణ కోసం అమెరికా వెళ్ళడం, మూణ్ణెల్ల తర్వాత తిరిగి రావడం జరిగింది. ఈలోగా కుప్పల కొద్దీ రిప్రజంటేషన్స్ కొన్ని ఢిల్లీకి డైరెక్టుగానూ, మరికొన్ని ప్రొజెక్టు ద్వారానూ వెళ్ళాయి. శ్యామలరావు చాలామందికి చెడ్డవాడై పోయాడు. అంతేకాక యితర ప్రోజెక్ట్‌లో ఉన్నవాళ్ళు కూడా మొత్తం దేశంలోని సీనియారిటీ చూసి ఉండవలసిందని సంస్థ మీద నింద వేశారు. ఆ రిప్రెజెంటేషన్స్ అన్నింటికీ సమాధానం ఇవ్వవలసిందిగా ఢిల్లీ ఆఫీసు ఫైల్‌ని ప్రోజెక్ట్ ఆఫీసుకు పంపింది.

అప్పటికి మిశ్రా జాగాలో నందా అనే కొత్త ఆర్.డి. బదిలీ మీద వచ్చాడు. అంతా కప్పల తక్కెడ వ్యవహారం చేశారంటూ పాత ఆర్.డి. మిశ్రా మీద నిందలు మోపుతూ, ఆ ఫైల్‌ని శ్యామలరావు చేతికందించి వారం రోజుల్లోగా సమాధానం యివ్వవలసిందిగా చాలా నిర్దాక్షిణ్యంగా ఆదేశించాడు.

శ్యామలరావు వారం రోజులు కాదు కదా ఒక్క క్షణం కూడా ఆగకుండా కొత్త ఆర్.డి.కి ఎదురు సమాధానమిచ్చాడు.

"నేను ఆ రిప్రెజెంటేషన్స్‌కి సమాధానం యివ్వలేను. మీరు కాదూ, కూడదూ అంటే శిక్షణా కార్యక్రమం కోసం నేను ప్రారంభించిన ఒరిజినల్ ఫైలే నా సమాధానమంటూ వ్రాసిస్తాను. మరో మాట సాబ్? ప్లాంట్ పరికరాల్ని సైట్‌కి తరలించి ఎసంబ్లీ పూర్తి చేయించాను. శిక్షణ పొంది తిరిగి వచ్చినవారిలో వెన్ను నిలిపి దన్ను నిచ్చిన వారు యిద్దరు. వాళ్ళూ, వారితో బాటు అహోరాత్రాలు నేనూ శ్రమించాం. ప్రారంభోత్సవానికి ఎవర్ని పిలుస్తారో నిర్ణయించండి. ఇంకో మాట కూడా ఉంది. నేను వచ్చి నాలుగేళ్ళయింది.

వచ్చిన కొత్తలో నేను రూపొందించిన ఈ ప్రణాళిక యిప్పటికి నెరవేరింది. యిది పూర్తిగా నిలదొక్కుకుని, టీతింగ్ ప్రొబ్లెమ్స్‌ని అధిగమించి తన దారిన తాను సక్రమంగా పని చేసుకొంటూ పోవడానికి ఎంతో శ్రమ పడాలి. ప్లాంట్‌కి పురిట్లోనే సంధి కొట్టడం నా కిష్టం లేదు. అందుచేత మరో రెండు సంవత్సరాలు యిక్కడే ఉండిపోతాను. లేకపోతే నా పేరు మీద ఓ మచ్చ పడిపోతుంది."

సూటిగా చెప్పిన శ్యామలరావు సమాధానం విని నందా ఆలోచనలో పడ్డాడు. ఛైర్మన్‌నీ, మెంబర్లనీ, మంత్రుల్నీ, మంత్రివర్గ కార్యదర్శుల్నీ, స్థానిక నాయకుల్నీ యిరకాటంలో పెట్టడానికి ఏ ఉన్నతాధికారీ సాహసించడు. ఈ సిఫారసుల తతంగాలు దేశ పాలనా యంత్రాంగంలో ముఖ్యమైన పాత్రని వహిస్తున్నాయి.

మెట్టు దిగి నందా అన్నాడు – "పరిస్థితి నాకు తెలియక కాదు. యిలా చేస్తే బావుండేది అన్న క్షణికావేశంలో అన్న మాటలివి. కఱ్ఱ విరగకుండా, పాము చావకుండా ఏదో సమాధానమివ్వాలి. మనిద్దరమూ బుఱ్ఱ బద్దలుకొట్టుకుని ఏదో డ్రాఫ్ట్ రిప్లై తయారు చేద్దాం ముందుగా. సహకరించండి!"

"ఆ సమాధానం డ్రాఫ్ట్ చెయ్యడానికి దల్జిత్‌సింగ్‌ని నియోగిస్తాను! వాతలు పెడ్తే కాని వాళ్లకీ తెలియదు!" అన్నాడు శ్యామలరావు.

"మంచి ఆలోచన! అలాగే కానివ్వు!" అన్నాడు నందా.

శిక్షణా కార్యక్రమాల్లోని చికాకులు యిన్నీ అన్నీ కావు. సీనియారిటీలు, బదిలీలు, కేటాయింపులూ కొన్ని సమస్యల్ని తీసుకువస్తాయి. కాని బాహాటంగా ఎవరూ ఒప్పుకోని బలీయమైన కారణం డబ్బు.

తర్ఫీదుల ఖర్చులు కంపెనీలు భరిస్తాయి. దినభత్యాలు అందజేస్తాయి. పనిజేస్తున్న ఊళ్ళోనే శిక్షణ పొందితే అభ్యర్థికి దొరికేది దంపుడు నూక! ఊరు వదిలి పై ఊరు వెడ్తే స్వంత ఖర్చులు పోను దినభత్యంతో మిగిలేది ×1 రూపాయలు. దేశం వదిలి ఏ విదేశమేగినా యిచ్చేది డాలర్లు లేదా పౌండ్లు. మిగల్చుకొనకలిగేది ×45 లేదా ×65 రూపాయలు.

అందుకనే రెండు రోజులు విదేశాల్లో కాన్ఫరెన్స్ కోసం వెళ్లినవాడు వారం రోజులు ట్రైనింగ్ కోసం వెళ్ళినవాణ్ణి గుర్రుగా చూస్తాడు. వారం రోజులు ట్రైనింగ్ కోసం వెళ్ళినవాడు రెండు వారాలు వెళ్ళిన వాణ్ణి చూసి పళ్ళు బిగిస్తాడు. యిలా తర్ఫీదుల కాలంలోని ఎక్కువ తక్కువల సమయాలు ఎనలేని సమస్యల్ని సృష్టిస్తాయి. అటువంటప్పుడు అసలు వెళ్ళని వాడికి కడుపు మండదూ?! యిందులో సామర్థ్యాల ప్రసక్తి లేదు. ధనమూలం మిదం జగత్! అందుకే అన్ని రిప్రెజెంటేషన్స్!

అత్తగారి సొమ్ముతో సోకులు చేసే అల్లుళ్ళ నుంచి అర్జీలకేం కొదవ? ●